నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, ఆదివారం 7 జనవరి 2024 | HYDERABAD

పొగమంచు హెచ్చరిక

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో చలిగాలుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువకు పడిపోతున్నాయి. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 29.2 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 17.6డిగ్రీలు, గాలిలో తేమ 37శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా ఉదయం వేళలో గ్రేటర్ వ్యాప్తంగా దట్టమైన పొగ మంచు ఏర్పడే అవకాశాలున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో నగరానికి ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.

సీపీలను కలిసిన డీసీపీలు

జూబ్లీహిల్స్, జనవరి 6 : సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్‌లలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీసీపీలు శనివారం ఆయా సీపీలను మర్యాదపూర్వకంగా కలిశారు. సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీగా కొత్తపల్లి నరసింహ, రాజేంద్రనగర్ డీసీపీగా శ్రీనివాస్, సైబర్ క్రైమ్స్ డీసీపీగా శిల్పవల్లి, ఉమెన్ సేఫ్టీ డీసీపీగా సృజన కర్ణం, మేడ్చల్ ఎస్‌వోటి డీసీపీగా దన్నరపు శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. మల్కాజ్‌గిరి డీసీపీ పీవీ పద్మజ, ఎల్బీనగర్ డీసీపీగా ప్రవీణ్ కుమార్, మహేశ్వరం డీసీపీగా సునితారెడ్డి, ట్రాఫిక్-1 డీసీపీగా మనోహర్ బాధ్యతలు చేపట్టిన అనంతరం రాచకొండ సీపీ సుధీర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

స్పృహలో ఉండగానే..

మెదడులోని కణితి తొలగింపు

- *మలక్‌పేట కేర్ దవాఖానలో ఆపరేషన్ విజయవంతం*

చాదర్‌ఘాట్, జనవరి 6 : మలక్‌పేట కేర్ దవాఖాన వైద్యులు స్పృహలో ఉన్న రోగికి మెదడులోని కణితిని(ట్యూమర్) విజయవంతంగా తొలగించి అరుదైన ఆపరేషన్ చేశారు. వైద్య రంగంలో మేజర్ శస్త్ర చికిత్సను స్పృహలో ఉన్న రోగికి సుమారు ఆరు గంటల పాటు తీవ్రంగా శ్రమించి మెదడులోని ఇతర భాగాలకు ఎటువంటి ప్రమాదం జరుగకుండా ట్యూమర్‌ను తొలగించారు. ఇందుకు సంబంధించి దవాఖాన చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కృష్ణమూర్తి, న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ కేవీ.శివానంద్‌రెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్‌కు చెందిన గిరిధర్(40) కొద్ది రోజులుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతుండడంతో కేర్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మెసియల్ టెంపోరల్ స్క్లెరోసిస్‌తో బాధపడుతున్నట్లు గుర్తించారు. శస్త్ర చికిత్స చేసి ట్యూమర్‌ను తొలగించాలని వైద్యులు నిర్ధారణ చేశారు. సాధారణ సర్జరీ చేస్తే రోగి ప్రాణాలు పోయే ప్రమాదముందని భావించి.. న్యూరో సర్జరీ, అనస్తీషియా వైద్యులు కలిసి అమిగ్దలోహిప్పో కాంపెక్టమీ అవేక్ క్రేనిటోమి సర్జరీ చేయాలని నిర్ణయించారు. సుమారు ఆరు గంటల పాటు శ్రమించి ట్యూమర్‌ను తొలగించినట్లు వైద్యులు పేర్కొన్నారు. శస్త్ర చికిత్స తరువాత 4వ రోజు రోగిని డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. కేర్ ఆసుపత్రి మలక్‌పేటలో తొలిసారిగా చేపట్టిన ఈ మేజర్ సర్జరీ విజయవంతం కావడంతో వైద్యులు హర్షం వ్యక్తం చేశారు. సర్జరీలో భాగస్వాములైన వైద్యులను చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కృష్ణమూర్తి అభినందించారు.

స్వచ్ఛతలో 5 స్టార్

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీహెచ్‌ఎంసీకి జాతీయ అవార్డు

- గార్బేజ్ ఫ్రీ సిటీలో నగరానికి గుర్తింపు
- 11వ తేదీన అవార్డును అందుకోనున్న కమిషనర్ రొనాల్డ్ రాస్

జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్‌తో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్‌ను పరిశుభ్రంగా ఉంచడంలో జీహెచ్‌ఎంసీ ప్రతి ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు దక్కించుకుంటున్నది. డిసెంబర్ 23 నుంచి పది రోజుల పాటు క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాన్ని కేంద్రం సేకరించి స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో జాతీయ అవార్డుకు జీహెచ్‌ఎంసీని ఎంపిక చేసింది. 2023 సంవత్సరంలో గార్బేజీ ఫ్రీ సిటీలో ఇప్పటికే త్రీ స్టార్ సిటీ ర్యాంకింగ్ జాబితాలో ఉండగా, తాజాగా 5 స్టార్ రేటింగ్‌తో జాతీయ అవార్డును సాధించింది. ఈ నెల 11న న్యూఢిల్లీలో కేంద్ర గృహ పట్టణాభివృద్ధి వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా అందించే జాతీయ స్థాయి అవార్డుల ప్రదానానికి జీహెచ్‌ఎంసీకి శనివారం ఆహ్వానం అందింది. కాగా జాతీయ స్థాయిలో జీహెచ్‌ఎంసీకి అవార్డు రావడంతో మరింత బాధ్యత పెరిగిందని, ఈ అవార్డు దక్కడంలో విశేషంగా కృషి చేసిన ప్రతి ఒక్కరికీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రొనాల్డ్ రాస్ ధన్యవాదాలు తెలిపారు.

జీహెచ్‌ఎంసీ సాధించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు

- 2016 సంవత్సరంలో 73 నగరాలకుగానూ మెరుగైన 19వ ర్యాంకును సొంతం చేసుకున్నది.
- 2017లో ఓడీఎఫ్ సిటీ కేటగిరిలో 434 నగరాలు పాలుపంచుకోగా, అందులో నగరానికి 22వ ర్యాంకు సాధించింది.
- 2018లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానంలో బెస్ట్ క్యాపిటల్ సిటీ అవార్డు కేటగిరిలో 4041 నగరాలు ఉంటే హైదరాబాద్‌కు 27వ ర్యాంకు వచ్చింది.
- 2019లో స్వచ్ఛ్ ఎక్సలెన్స్ అవార్డు కేటగిరిలో 4273 నగరాలు పాల్గొంటే , హైదరాబాద్‌కు 35వ ర్యాంకు వచ్చింది. ఓడీఎఫ్ ++ సిటీగా గుర్తింపు దక్కింది.
- 2020లో బెస్ట్ మెగా సిటీ అవార్డు సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో 4384 నగరాలు పాల్గొంటే నగరానికి 23వ ర్యాంకు వచ్చింది. అదే విధంగా ఓడీఎఫ్ ++ సిటీగా గుర్తింపు దక్కింది.
- 2021లో బెస్ట్ సెల్ఫ్ సస్టైనబుల్ మెగా సిటీ అవార్డును పొందడం ద్వారా త్రీ స్టార్ హోదాను పొందింది. ఇదే సంవత్సరంలో వాటర్‌ప్లస్ సర్టిఫికేషన్‌ను రెండో సారి పొందింది.
- 2022 సంవత్సరంలో గార్బేజ్ ఫ్రీ సిటీ కింద త్రీ స్టార్ హోదాను పొందింది.

శేరిలింగంపల్లికి స్నేహ కూకట్‌పల్లికి అభిలాష

రెండు జోన్లకు కమిషనర్లుగా ఐఏఎస్‌ల నియామకం

స్నేహ శబరీష్

అభిలాష

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీలో పలువురు జోనల్ కమిషనర్లకు స్థానచలనం కల్పిస్తూ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి అభిలాష అభినవ్, శేరిలింగంపల్లి కొత్త జోనల్ కమిషనర్‌గా మరో ఐఏఎస్ స్నేహ శబరీష్‌ను నియమించారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షురాలు, జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమతను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి డిప్యూటేషన్ రద్దు చేసి మాతృ సంస్థ చేనేత, జౌళిశాఖ అదనపు డైరెక్టర్‌గా బదిలీ చేశారు. జీహెచ్‌ఎంసీ ఎస్ఆర్‌డీపీ ఎస్ఈ వెంకటరమణను మూసీ నది అభివృద్ధి సంస్థ ఎస్ఈగా బదిలీ చేశారు. ప్రస్తుతం మూసీ అభివృద్ధి సంస్థ ఎస్ఈ మల్లికార్జునుడును ఈఎన్సీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

డిప్యూటీ కమిషనర్ల బదిలీలు

జీహెచ్‌ఎంసీలో పలువురు డిప్యూటీ కమిషనర్లను బదిలీ చేస్తూ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఉత్తర్వులు జారీ చేశారు. వై. శ్రీనివాస్ రెడ్డిని సర్కిల్-10కు, ఏఎంసీ డి. లావణ్యను ప్రధాన కార్యాలయానికి, సర్కిల్ 25కు వి. నర్సింహ, సర్కిల్-7కు ఏ.నాగమణి, సర్కిల్ 9కు ఎల్. సరిత, డాకు నాయక్‌ను జీహెచ్‌ఎంసీ కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

అహ్మదాబాద్‌లో సబర్మతీ నది అభివృద్ధి ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎంఆర్‌డీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి, అధికారులు

సబర్మతి ప్రాజెక్టుపై అధ్యయనం

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 3 నుంచి 6వరకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి ఆధ్వర్యంలో అధికారుల బృందం గుజరాత్‌లో పర్యటించింది. అహ్మదాబాద్ సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు, యమునా నదిని సందర్శించి, ఆయా ప్రాజెక్టులకు అనుసంధానంగా ఉన్న సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను వాటి సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ నమామి గంగ ప్రాజెక్టు డైరెక్టర్ జనరల్ (డీజీ) అశోక్ కుమార్‌తో కలిసి చర్చించారు. అహ్మదాబాద్ మునిసిపల్ ఉన్నతాధికారి తెన్నరసన్, సబర్మతి రివర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ జగదీశ్ పటేల్, జనరల్ మేనేజర్ సుశాంత్ భాటియా, నమామి గంగా ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశిష్ట, ఉన్నతాధికారులు ఎన్.కె.మదన్, పీయూష్ గుప్తా తదితరులతో మూసీ రివర్ ఫ్రంట్ అధికారులు సమావేశం అయ్యారు.

ప్రజాపాలనలో 24,74,325 దరఖాస్తులు

- అభయహస్తం కింద 19,01,256, ఇతర దరఖాస్తులు 5,73,069

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : ప్రజాపాలన ముగిసింది. డిసెంబరు 28, 2023న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించి, శనివారం వరకు (డిసెంబర్ 31, జనవరి 1వ మినహా) దరఖాస్తులను అధికారులు ప్రత్యేక కేంద్రాల ద్వారా స్వీకరించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని 30 సర్కిళ్లతో పాటు కంటోన్మెంట్ బోర్డు కలిపి 650 కేంద్రాలలో దరఖాస్తులు స్వీకరించారు. 8 రోజుల వ్యవధిలో మొత్తం 24,74,325 దరఖాస్తులు రాగా..ఇందులో అభయహస్తం కింద 19,01,256, ఇతర దరఖాస్తులు 5,73,069 ను స్వీకరించారు. ఆరు గ్యారంటీల పథకాల్లో మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు రూ. 2,500లు, రూ.500లకు వంట గ్యాస్ రాయితీ, గృహలక్ష్మీ కింద 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్‌పై ప్రజలు ఆసక్తిని కనబర్చారు. దీంతో పాటు కొత్త రేషన్‌కార్డుల కోసం భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తం దరఖాస్తుల్లో 40 శాతం పాతనగరం నుంచే రాగా, కంటోన్మెంట్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో అత్యల్పంగా దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. కాగా దరఖాస్తులోని సమాచారాన్ని కంప్యూటరీకరించే పనులకు జీహెచ్‌ఎంసీ ప్రారంభించింది. రెండు రోజులుగా కేంద్ర కార్యాలయంలో సర్కిళ్ల వారీ అధికారులు, సమాచారాన్ని నమోదు చేసే ఏజెన్సీలకు శిక్షణ ఇచ్చారు. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను వినియోగించే విధానం, సమాచారాన్ని ఆన్‌లైన్ దరఖాస్తులో ఎలా నింపాలనే అంశాలపై అవగాహన కల్పించారు. సోమవారం నుంచి ఈ నెల 17వ తేదీలోగా వచ్చిన 24.74 లక్షల దరఖాస్తుల డేటాను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయనున్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రజా పాలన చివరి రోజు శనివారం మొత్తం 322147 దరఖాస్తులు స్వీకరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హమీలను విస్మరిస్తే ప్రశ్నిస్తాం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



కందుకూరులో కల్యాణ లక్ష్మి లబ్ధిదారులతో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు. జనవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హమీలను నెరవేర్చాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కోరారు. హమీలను విస్మరిస్తే ప్రజల గొంతుకై ప్రశ్నిస్తామని ఆమె పేర్కొన్నారు. శనివారం కందుకూరు మండల పరిషత్ సమావేశపు హలులో 180మందికి కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచినట్లు చెప్పారు. కందుకూరు వరకు మెట్రో, మెడికల్ కళాశాల, ప్రతి పంచాయతీకి రూ. 10 లక్షలు వచ్చే విధంగా కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రైతు బంధు నిధులను జమ చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ రద్దు చేయడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి. వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు, ఎంపీటీసీ తాండ్ర ఇందిరమ్మ దేవేందర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి దశరథ ముదిరాజ్, మండల అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్, మేఘనాథ్‌రెడ్డి, యూత్ నాయకులు కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, చిర్ర సాయిలు, గుయ్యని సామయ్య, డైరెక్టరు పొట్టి ఆనంద్, కాసోజు ప్రశాంత్‌చారి, గొర్రెంకల రామకృష్ణా, ప్రవీణ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తూంకుంటలో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

17 వరకు ఆన్‌లైన్‌లో నమోదు

మేడ్చల్, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ శనివారంతో ముగిసింది. దరఖాస్తులను ఈ నెల 17 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలో ప్రతి రోజూ డేటా ఎంట్రీలు చేసే విధంగా చూడాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులకు ఆదేశించారు.

రూ. 50కి 'అభయహస్తం' విక్రయం..

వెంగళరావునగర్, జనవరి 6: అభయహస్తం దరఖాస్తులను విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శ్రవణ్ తెలిపిన వివరాల ప్రకారం.. దాసారం బస్తీలోని ప్రజాపాలన కేంద్రం వద్ద ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న అభయహస్తం దరఖాస్తు పత్రాలను స్థానికుడు పాకాల వెంకటేశ్ గౌడ్.. రూ.50కి ఒకటి చొప్పున విక్రయిస్తున్నట్లు కేంద్రం ఇన్‌చార్జి, జీహెచ్‌ఎంసీ ఏఈ సాయి సందీప్ దృష్టికి వచ్చింది. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడుపై కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టారు.

రేబిస్ కట్టడికి ఐఐఎల్ చేయూత

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : ప్రముఖ వ్యాక్సిన్ తయారీల సంస్థ ఇండియన్ ఇమ్యూనలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) సంస్థ రేబిస్ నియంత్రణకు పైలట్ ప్రాజెక్టులో భాగంగా తిరువనంతపూర్ ప్రాంతానికి ఆర్థిక సాయం చేయనుంది. వీటితోపాటు రేబిస్ కట్టడికి అవసరమైన చర్యలపై అధ్యయనం చేయనున్నట్లుగా ఐఐఎల్ వర్గాలు పేర్కొన్నాయి.

మహానగరాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

సీఐఐ ప్రతినిధుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీఐఐ ప్రతినిధుల సమావేశంలో వెల్లడించారు. మెట్రో రైల్ రూట్ విస్తరణపై జరిగిన చర్చలో సీఎం మరోమారు స్పష్టతను ఇచ్చారు. గతంలో గచ్చిబౌలి - ఎయిర్ పోర్టు వరకు 31 కిలోమీటర్ల మేర ప్రణాళికలు రూపొందించారని, దాని వల్ల సామాన్యజనాలకు పెద్దగా ఉపయోగం లేదన్నారు. గచ్చిబౌలి, జూబ్లీహిల్స్ చుట్టూ అధికంగా ధనికులు ఉండటం వల్ల వారు ఎక్కువగా సొంత వాహనాలు వాడుతున్నారని అన్నారు. గతంలో సర్వే చేసిన గౌలిగూడ - ఫలక్‌నుమా - ఎయిర్‌పోర్టు రూట్, ఎల్బీనగర్ నుంచి ఎయిర్ పోర్టు రూట్‌ను ప్రజలు ఎక్కువగా వినియోగించుకునే అవకాశాలు ఉన్నాయని అన్నారు.

తొలిదశలో 55 కి.మీ మేర అభివృద్ధి

మూసీ నది పరీవాహక ప్రాంతాన్ని తొలిదశలో 55 కిలోమీటర్ల మేర మెట్రో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఓఆర్‌ఆర్ లోపల మూసీ నది పరివాహక ప్రాంతాల్లో ఐకానిక్ డిజైన్లతో అమ్యూజ్‌మెంట్ పార్కులు, వాటర్ ఫాల్స్, చిల్డ్రన్ వాటర్ స్పోర్ట్స్, స్ట్రీట్ వెండర్స్, బిజినెస్ ఏరియాలు, షాపింగ్ మాల్స్‌ను అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. చారిత్రాత్మక కట్టడాలైన చార్మినార్, గొల్కొండ, సెవెన్ టూంబ్స్, తారామతి బారాదరి వంటి వాటిని అనుసంధానిస్తూ ఒక టూరిజం సర్క్యూట్‌ను రూపొందించాలని సూచించారు. ఈ ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) మోడల్‌లో పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామన్నారు. మూసీ నది పరివాహక ప్రాంతంలో చెక్ డ్యాములను నిర్మించి వాటర్ ఫౌంటెన్స్, వాటర్ ఫాల్స్ ఏర్పాటు చేస్తామని, ఫైవ్ స్టార్ హోటల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం సహకారమందిస్తుందని సీఐఐ ప్రతినిధుల సమావేశంలో సీఎం పేర్కొన్నారు.

నగరానికి నలువైపులా డంప్ యార్డులు

- జీహెచ్‌ఎంసీ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ చుట్టూ నాలుగువైపులా నాలుగు డంప్ యార్డులను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. ప్రస్తుతం నగరానికంతటికి జవహర్‌నగర్‌లో ఒకే డంప్ యార్డు ఉన్నదని, ప్రతిరోజు సుమారు 8 వేల టన్నుల చెత్త డంప్ యార్డుకు చేరుతుందని పేర్కొన్నారు. సిటీకి దూరంగా గతంలో శంషాబాద్, మెదక్ వైపు డంప్ యార్డు సైట్‌లను పరిశీలించామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిశీలించి ప్రజలకు ఇబ్బందికరంగా లేకుండా ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. చెత్త ద్వారా 15 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని, ఇందుకు గాను టీఎస్ఎస్పీడీసీఎల్‌తో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. చెత్తను సాధ్యమైనంతవరకు రీసైకిల్ చేయాలని, ఇందుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

బస్సెక్కి దవాఖానకు..

- మహాలక్ష్మితో పెరిగిన రద్దీ
- ఇబ్బందులు పడుతున్న వృద్ధులు
- హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సర్వే రిపోర్టు

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకంలో ఆర్టీసీ బస్సుల్లో ద్వంద్వ ప్రయోజనాలతో పాటు సమస్యలు ఉన్నాయని హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ (హెచ్‌హెచ్‌ఎఫ్) సర్వేలో తెలిసింది. పబ్లిక్ హెల్త్ ఎన్జీవో అయిన హెచ్‌హెచ్‌ఎఫ్ వలంటీర్లు రెండు వారాల పాటు నగరానికి దక్షిణంగా ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల వద్ద ఈ సర్వే నిర్వహించారు. ఈ పథకం అమలు కాకముందు ఎక్కువగా ఓల్డ్ సిటీ నుంచి 52శాతం మంది బస్సుల్లో ప్రయాణించేవారు. పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఈ సంఖ్య 81శాతానికి పెరిగినట్లు సర్వేలో వెల్లడించారు. 15 శాతం మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని ఆరోగ్య సంరక్షణకు ఉపయోగించుకుంటున్నట్లు వెల్లడైంది. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ, ఏరియా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఔట్ పేషెంట్ల సంఖ్య 10 నుంచి 15 శాతం మధ్య పెరిగిందని తెలిసింది. 71 శాతం మంది మహిళలు ఓపీడీ కన్సల్టేషన్‌కు, 18శాతం మంది ప్రసూతి సంరక్షణకు, 11శాతం మంది ఇతర కారణాల వల్ల వైద్యశాలలకు వెళ్లినట్లు తేలింది. అయితే బస్సు సర్వీసులు సరైన సమయంలో రావడం లేదని మహిళలు ఫిర్యాదులు చేశారు. మరోపక్క మహిళల రద్దీ పెరిగి బస్సుల్లో సీనియర్ సిటిజన్లకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని రిపోర్టు పేర్కొన్నది. ఈ సర్వే 15 రోజుల్లో 3530 మంది మహిళలతో మాట్లాడి రిపోర్టును రూపొందించినట్లు ఫౌండేషన్ ప్రతినిధులు వెల్లడించారు.

విద్యారంగాన్ని దేశానికి ఆదర్శంగా నిలపాలి

హైదరాబాద్, జనవరి 6(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని దేశానికి ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలను కల్పిస్తామని, ఉపాధ్యాయుల కొరత లేకుండా తగిన చర్యలు చేపడతామన్నారు. పీఆర్టీయూ టీఎస్ 2024 నూతన డైరీని సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ఆవిష్కరించారు. డిసెంబర్ నెల వేతనాలను ఇచ్చిన మాట ప్రకారం 5వ తేదీలోగా చెల్లించినందుకు ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి, పీఆర్టీయూ టీఎస్ నేతలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం ఆరంభం నాటికే ఉపాధ్యాయ పదోన్నతులతో పాటు అన్ని సమస్యలు, పరిష్కరించాలని ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి సీఎంను కోరారు. డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్ రావు, పంచాయితీరాజ్ ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.